5న 'సాక్షి' ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సంక్రాంతి పండగను పురస్కరించుకుని ఈ నెల 5న 'సాక్షి' ఆధ్వర్యంలో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్ పర్సన్ దేవిరెడ్డి కమలాసుధీర్‌రెడ్డి తెలిపారు. వనస్థలిపురం ఎన్జీవోస్ కాలనీలోని ఛత్రపతి శివాజీ గ్రౌండ్‌లో (నాగార్జున పాఠశాల ఎదురుగా) ఆదివారం ఉదయం 9.30లకు పోటీలు ప్రారంభం అవుతాయని పూర్తి వివరాలకు 9705347239, 9705347248 నంబర్లలో సంప్రదించాలన్నారు. –వనస్థలిపురం

సర్కారు బడులు @మెరుగైన ఫలితాలు

- కార్పొరేటుకు దీటుగా బోధన
- జీపీఏ-10 లక్ష్యంగా కసరత్తులు
- చంపాపేటలో ప్రారంభమైన ప్రత్యేక తరగతులు

చంపాపేట: ఒకప్పుడు సర్కారు బడుల్లో చదివించాలంటే తల్లిదండ్రులు వెనక్కి తగ్గేవారు. ప్రైవేట్‌లలో చదివించే స్తోమత లేకున్నా అప్పో.. సొప్పో చేసి మరీ చదివించేవారు. కానీ.. ప్రస్తుతం తీరు మారింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యాబోధనా వ్యవస్థలో పాలకులు తీసుకుంటున్న విప్లవాత్మక నిర్ణయాలు, ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవ విశాలమైన క్రీడా మైదానం, పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనం, మెరుగైన ఫలితాలు, విద్యార్థుల్లో క్రమశిక్షణ, వంటి మార్పులతో తల్లిదండ్రులు తమ పిల్లలను.. ప్రచార హంగూ ఆర్భాటాలతో జేబులను గుల్లచేసే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా పదిలో మెరుగైన ఫలితాలు సాధిస్తూ తమ సత్తాను చాటే ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివించేందుకే తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. చంపాపేట డివిజన్ పరిధిలో కర్మన్‌ఘాట్, చంపాపేటలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉండగా పదవ తరగతిలో 258 మంది విద్యార్థులు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో విద్యనభ్యసిస్తున్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఇప్పటికే కసరత్తులు ప్రారంభించారు.

శని, ఆదివారాల్లో ప్రత్యేక తరగతులు

ప్రతీ శని, ఆదివారాలలో వారం పాటు నేర్చుకున్న పాఠ్యాంశాలపై పరీక్షలు నిర్వహించి తక్కువ మార్కులు వచ్చిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.బడి నుంచి ఇంటికి చేరిన విద్యార్థులకు పాఠ్యాంశాలపై అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు స్మార్ట్ ఫోన్‌లో దీక్షా యాప్ ద్వారా పాఠ్యాంశాలు ఏ విధంగా వీక్షించాలో అవగాహన కల్పిస్తునే పాఠ్య పుస్తకాలపై ఉండే క్యూ ఆర్ కోడ్ ద్వారా హోంవర్క్ చేసేలా తర్ఫీదు కూడా ఇస్తున్నారు. విద్యార్థుల మానసికస్థాయి ఆధారంగా



చంపాపేట పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

మూడు గ్రూప్‌లుగా విభజించి ప్రతిరోజు సబ్జెక్టుల వారీగా స్లిప్ టెస్ట్‌లు, ఉదయం, సాయంత్రం వేళల్లో చర్చా పద్ధతిలో ప్రత్యే క తరగతులు నిర్వహిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఆయా సబ్జెక్ట్ ఉపాధ్యాయులు ముఖ్య పాఠ్యాంశాలను అర్థమయ్యేలా పలుమార్లు బోధన చేస్తుండటంతో పాటు అవసరమైతే డిజిటల్ ఐఎఫ్‌డీ ప్యానల్ బోర్డు, స్మార్ట్ ప్రాజెక్టర్ ద్వారా పాఠ్యాంశ బోధనలు చేస్తున్నారు. మార్చిలో ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

సీసీఈ విధానంతో..

గత రాష్ట్ర ప్రభుత్వం నిరంతర సమగ్ర మూల్యాంకన (సీసీఈ) విధానం అమలు పరిచింది. దీంతో విద్యార్థులు బట్టీ విధానానికి స్వస్తి పలుకుతూ తరగతి గదిలో విద్యార్థి కేంద్రంగా ఉపాధ్యాయులు చర్చా, ప్రాజెక్ట్ పద్ధతిలో విద్యార్థి కేంద్రంగా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు ఎంత మేర అర్థమైందో తెలుసుకునేందుకు వారితోనే స్వయంగా ప్రశ్నలు కూడా రూపొందించి సమాధానాలు రాబట్టే విధానాన్ని అమలు పరుస్తున్నారు. దీంతో ఆయా కఠినతరమైన పాఠ్యాంశాలపై కూడా విద్యార్థులకు పూర్తిస్థాయి ఆసక్తి అవగాహన పెరిగి పరీక్షా సమయంలో ఎలాంటి ప్రశ్నలు ఇచ్చినా సులభంగా సమాధానాలు రాసే విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇస్తున్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం..



పదవ తరగతిలో ఇంగ్లిష్, తె లుగు మీడియంలో 136 మంది విద్యార్థులు ఉన్నారు. నవంబర్ నాటికే సిలబస్ పూర్తి చే శాం. డిసెంబర్ నెల ప్రారంభ ం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు గంటల పాటు ప్రత్యేక తరగతు లతో పాటు ప్రతీ రోజు పాఠ్యాంశాలవారీగా స్లిప్ టె స్టులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ జీపీఏ 10తో అధిక విద్యార్థులు, వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేస్తున్నాం.

–ఎస్. విజయ, చంపాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం

ప్రణాళికాబద్ధంగా బోధన..



గతంలో ఆరు సబ్జెక్టులకు సెకండ్ లాంగ్వేజ్ హిందీకి మినహా అన్ని సబ్జెక్టులకు రెండేసీ అంటే 11 పేపర్లు ఉండేవి. ప్రస్తుతం ఏడు పేపర్లుగా కుదించారు. అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షా పేపరు ఉండగా సైన్స్‌లో మాత్రం ఫిజిక్స్, బయాలజీను వేరు చేసి రెండు పేపర్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యార్థులకు ప్రణాళికాబద్ధంగా బోధన చేసి పరీక్షకు సిద్ధం చేశాం. గతేడాది కన్నా ఎక్కువ సంఖ్యలో జీపీఏ 10, ఉత్తీర్ణత సాధించి తీరుతాం.

–గీతాలక్ష్మి, ఉపాధ్యాయురాలు, చంపాపేట

తల్లిదండ్రులకు ఫోన్ కాల్స్..



పాఠశాలలోనే కాకుండా విద్యార్థులు ఇంటివద్ద చదువుకునేలా ప్రయత్నిస్తున్నాం. ఉదయం 5 గంటలకే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి వారి పిల్లలను చదివించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతీ ఉపాధ్యాయుడు చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అందరం కృషి చేస్తున్నాం.

–ఆర్. పద్మజ గణితశాస్త్ర ఉపాధ్యాయురాలు, చంపాపేట

జీపీఏ-10 సాధిస్తా..



మా పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం బాగుంది. ప్రతీ సబ్జెక్ట్‌లో పాఠ్యాంశాలన్నీ ఇప్పటికే ఒకసారి రివిజన్ చేశాం. అర్థం కాని పాఠ్యాంశాలు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నాం.మొత్తం సిలబస్‌లో ఏ ప్రశ్న వచ్చినా ఆందోళన లేకుండా సునాయసంగా రాసేటట్లు ఉపాధ్యాయులు తర్ఫీదు ఇచ్చారు. పది ఫలితాల్లో జీపీఏ 10 సాధిస్తా.

–పి. దివ్యశ్రీ, పదో తరగతి విద్యార్థిని చంపాపేట

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం



స్థానికులతో మాట్లాడుతున్న వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శంగా తీర్చదిద్దడమే లక్ష్యమని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పవన్‌పురి, ఉదయ్‌నగర్, సూర్యానగర్, ఎంఆర్‌ఆర్ కాలనీలో పాదయాత్ర చేస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ వర్షాకాలంలో జిల్లెలగూడ, మీర్‌పేట, బాలాపూర్, హస్తినాపురం వంటి పలు ఎగువ కాలనీల ప్రవహించే వరదనీటితో చంపాపేట డివిజన్‌లోని పలు లోతట్టు కాలనీలు ముంపునకు గురవ్వడం పరిపాటిగా మారిందన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకే మంద మల్లమ్మ చౌరస్తా నుంచి సాగర్‌రింగ్ రోడ్డు, ఎల్‌బీనగర్ చౌరస్తా మీదుగా మూసీనది వరకు ప్రత్యేక వరదనీటి కాలువ ఏర్పాటు కోసం ప్రణాళికను కూడా సిద్ధం చేశామన్నారు. కార్పొరేటర్ వెంట సర్కిల్ ఏఈ సురేష్, సిబ్బంది రాములు, రాజేందర్, నాయకులు రవీందర్‌రెడ్డి, నరసింహా, అమర్, సుధాకర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్, వేణు, గంగాధర్‌రెడ్డి, దుర్గారెడ్డి పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీనివాస్, చేకోలేకర్ లక్ష్మి



సీఎంను కలిసిన సంఘిరెడ్డి

సీఎంకు శుభాకాంక్షలు

మలక్‌పేట: హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేకోలేకర్ లక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గురువారం మలక్‌పేట నుంచి కమిటీ డైరెక్టర్లు, నియోజకవర్గ పార్టీ నాయకులు, కుటుంబసభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- మలక్‌పేట కాంగ్రెస్ సీనియర్ నేత, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ప్రొద్దుటూరి సంఘిరెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కోట్ల శ్రీనివాస్

సైదాబాద్: హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయిస్తా



ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి గురువారం ఎంపీని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులను మంజూరు చేయిస్తానని అన్నారు.ఎంపీని కలిసిన వారిలో శ్రీనివాస్‌రెడ్డి, శంకరయ్యగౌడ్, శరత్‌కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్‌రెడ్డి, కిషోర్‌కుమార్, కాల్వ శ్రీధర్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

హస్తినాపురం: కేసులు, కోర్టులు గొడవలతో ఇబ్బందులు పడవద్దని రాజీ కుదుర్చుకుని సుఖసంతోషాలతో జీవించాలని, రాజీ మార్గమే రాజమార్గమని ఉమ్మడి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. హస్తినాపురం సెంట్రల్ కాలనీలోని కమ్యూనిటీహాల్లో గురువారం నిర్వహించిన ఉచిత న్యాయసలహా కార్యక్రమానికి వచ్చిన బాధితులకు న్యాయసలహాలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడుతూ.. బాధితులు పోలీస్ స్టేషన్లు, కోర్టులకు వెళ్లడం కన్నా శాంతియుతంగా చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఉచిత న్యాయ సలహా, కుటుంబ తగాదాల పరిష్కార సలహా కేంద్రంలో ఐదుగురికి సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సుబ్బారాయుడు, సూరిబాబు, ఆనందరావు, అనంతరెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

బీజేపీని బలోపేతం చేయాలి



శృతికి సభ్యత్వాలను అందజేస్తున్న నరేష్ యాదవ్

మలక్‌పేట: బీజేపీని మరింత బలోపేతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి అన్నారు. గురువారం మలక్‌పేటలో జరిగిన కార్యక్రమంలో అక్బర్‌బాగ్ అధ్యక్షుడు నరేష్ యాదవ్ డివిజన్‌లో నమోదైన సభ్యత్వాలను శృతికి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేలా కార్యకర్తలు పనిచేయాలన్నారు. రామరావు, అశోక్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సందడి సురేందర్ రెడ్డి, గజానంద్ పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

వనస్థలిపురం: పలు కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి, వీధి దీపాలు తదితర సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ కాలనీలలో నెలకొన్న సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు.



వినతిపత్రం ఇస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

మహేశ్వరం: నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కేఎల్లార్‌ను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ సర్పంచ్, ఎంపీటీసీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి నాయకుడు, కార్యకర్త ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలు చేసేందుకు ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. పీసీసీ సభ్యులు దేప భాస్కర్‌రెడ్డి, మంత్రి బాల్‌రాజ్, మంత్రి అంజయ్య, మదిలపురం మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్‌రెడ్డి, మాజీ ఇన్‌చార్జి ఎంపీపీ సునీతానాయక్, అంధ్యానాయక్, నారాయణ, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి పరామర్శ



కిరణ్ మృతదేహానికి నివాళి అర్పిస్తున్న పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు

సైదాబాద్: ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ కుటుంబాన్ని హైదరాబాద్ నగర పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు పరామర్శించారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తించే సైదాబాద్‌కు చెందిన కిరణ్ బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న హైదరాబాద్ నగర పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు నల్ల శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కంప శ్రీశైలం గురువారం సైదాబాద్‌కు చేరుకొని కిరణ్ మృతదేహానికి నివాళులర్పించారు. కిరణ్ అంతిమ సంస్కారాల కోసం సీపీ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 30 వేలు, కోఆపరేటివ్ సొసైటీ నుంచి రూ.50 వేలు అందజేశారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

మలక్‌పేట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సురేష్ సూచించారు. మలక్‌పేట పోలీసుల ఆధ్వర్యంలో గురువారం దిల్‌సుఖ్‌నగర్ శ్రీసాయి డిగ్రీ, పీజీ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో సైబర్ నేరాలు, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని, దానికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిలీప్‌రెడ్డి, లెక్చరర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం కమ్యూనిటీ హాల్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు చీరలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు త్వరలోనే టెండర్లు పిలిచి మహిళా భవన్ పనులను ప్రారంభిస్తా మని, రోడ్ నెం-4, 5లో డ్రైనేజీ పనులు పూర్తిచేయిస్తానని ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి హామీనిచ్చా రు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు, పీసీసీ సభ్యుడు దేవ భాస్కర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అనితా దయాకర్‌రెడ్డి, శంకర్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, కాలనీవాసులు దయా కర్, ఆంజనేయులు, నరేష్, సూర్యనారాయణ, ఆచార్యులు, కృష్ణమూర్తి, మహిళా మండలి అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సరిత, కోశాధికారి నిత్య, సంధ్య, వాణి, రమ పాల్గొన్నారు.



చిన్నారులకు పోషకాహారం అందించాలి

సైదాబాద్: చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషకాహారాన్ని అందించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి సూచించారు. డివిజన్ పరిధి పూసలబస్తీలోని పూసల సంఘం అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని మహిళలకు నిత్యావసరాలు, చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు ప్రయోజనాలను అందించే అంగన్‌వాడీ కేంద్రం సేవలను స్థానిక మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, జగన్నాథం పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ అరుణ

నాగోలు: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ అన్నారు. శ్రీ ఇంద్రప్రస్థ కాలనీ రోడ్ నెంబర్-7 నుంచి బృందావన్ కాలనీ వరకు రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆర్‌సీసీ పైప్‌లైన్ స్ట్రామ్ వాటర్ డ్రెయిన్ పనులకు గురువారం ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ వెంట గాయత్రి, హరిబాబు, లయ, సాయిబాబా, గోపాల్, నారాయణరెడ్డి, రాజేశ్వరి, శేఖర్ ఉన్నారు.

పార్కుల ఆధునికీకరణకు కృషి



పార్కులో పనులు ప్రారంభిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: పార్కుల ఆధునికీకరణకు కృషి చేస్తామని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కులో రూ.10 లక్షల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పార్కులో వాకింగ్ ట్రాక్ టైల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. పిల్లలు, పెద్దలు ఉల్లాసంగా గడిపే విధంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ పనులు పూర్తయిన వెంటనే గ్రీనరీ పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌రెడ్డి, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్తిరెడ్డి, నాయకులు కృష్ణరావు, చారి, సంతోష్, ప్రణీష్, మల్లికార్జున్, దినేష్, పాల్గొన్నారు.

క్రికెట్ క్రీడాకారిణికి చేయూత

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గం, ఆర్‌కేపురం డివిజన్ పరిధి ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన క్రికెట్ క్రీడాకారిణి చందన అండర్-23కి ఎంపికయ్యింది. క్రికెట్ కిట్ కొనుగోలు కోసం కాంగ్రెస్ నాయకుడు ఉపేందర్ రెడ్డి రూ.25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిభ, నైపుణ్యం ఉన్నవారికి పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే పేద విద్యార్థులు, క్రీడాకారులకు చేయూతనిచ్చేందుకు ముందుంటా అన్నారు. ఈ కార్యక్రమంలో లింగస్వామి గౌడ్, జగిని రమేష్, శ్యామ్, విప్లవ్, శ్రీకాంత్, కిషన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఉపేందర్‌రెడ్డి

ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యం

హయత్‌నగర్: ప్రమాద రహిత ప్రయాణమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఆర్టీసీ హయత్‌నగర్-1 డిపో మేనేజర్ విజయ్ అన్నారు. గురువారం డిపోలో రోడ్డు భద్రతా మాస ఉత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రోడ్డు భద్రతపై ప్రతిరోజు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నామని, ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తున్నామన్నారు. ప్రమాదాలు లేకుండా బస్సులను నడిపే డ్రైవర్లకు తగిన ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు.



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న విజయ్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు




చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. చంపాపేట, సుల్తానా అల్వా, అంజిరెడ్డి నగర్, పద్మానగర్, కర్మన్‌ఘాట్, సాయిరాంనగర్, రియల్ బేకర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు చంపాపేట, ఆర్‌టీసీ, సింగరేణి, భానునగర్, కర్మన్‌ఘాట్, గ్రీన్‌పార్కు, పవన్‌పురి, ఉదయ్‌నగర్, మైత్రిపురం, సాయిరాంనగర్, బృందావన్, వైశాలీనగర్, నాగార్జున నగర్, పటేల్‌నగర్, శిఖరా ఎన్‌క్లేవ్ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సైదాబాద్: ఆస్మాన్‌గఢ్ ట్రాన్స్‌కో డివిజన్ చంచల్‌గూడ సబ్‌స్టేషన్ పరిధిలోని డాన్‌స్కూల్, బీబీ కేన్సర్ హాస్పిటల్, రాజ్‌దర్బార్, జియాకాహోటల్, ఇబ్రహీం ఫంక్షన్‌హాల్, మౌళీ కా మాస్క్, బాబుమియా గిర్నీ పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.38, కాలిఫ్లవర్ రూ.13, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.35, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.35, గోకరకాయ రూ.28, దోసకాయ రూ.23, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.40, మునగ రూ.85, చిలుకడ దుంప రూ.60, బీట్‌రూట్ రూ.35, కీర రూ.15, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.47. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

జానారెడ్డికి డాక్టరేట్



నాగోలు: కొత్తపేటకు చెందిన సుంకిరెడ్డి జానారెడ్డికి డాక్టరేట్ వచ్చింది. తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీ గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ పి.వలసమీ, వర్ధమాన్ ఇంజినీరింగ్ కళాశాల గణితశాస్త్ర ఆచార్యుడు డాక్టర్ డి. శ్రీనివాస్‌రెడ్డిల పర్యవేక్షణలో 'నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఎ స్ట్రెచింగ్ షీట్ ఇన్ ప్రజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్' అనే అంశంలో చేసిన పరిశోధనకు అన్నామలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది.రైతు కుటుంబం నుంచి వచ్చిన జానారెడ్డికి డాక్టరేట్ రావడం పట్ల కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందనలు తెలిపారు. జానారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.